క్లుప్తంగా

క్రమశిక్షణతో మెలగాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో మెలగాలని మున్సిపల్ కమిషనర్ వంశీ తెలియజేశారు. శనివారం పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం 38వ వార్షికోత్సవం ప్రధానాచార్యులు కరణం తిరుమలరావు అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వంశీ పాల్గొన్నారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

శెట్టూరు: విద్యార్థులు మండుటెండలో అనవసరంగా తిరగొద్దని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. శనివారం మండలంలోని ఎర్రబోరేపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ పర్యటించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందువల్ల విద్యార్థులకు సూచనలు చేశారు. ఒంటిపూట బడులుకావడంతో మధ్యాహ్న సమయంలో బావులు, చెరువులు, వంకల వైపు వెళ్లొద్దని ఎంఈఓ సూచించారు. 31న జరగాల్సిన 10 వ తరగతి సోషల్ పరీక్ష ఏప్రిల్ 1న నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాలిసెట్ పరీక్షకు ఉచిత శిక్షణ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2025కు ఏప్రిల్ 1 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులను పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ నెలాఖరు వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కళ్యాణదుర్గం: పార్వతీనగర్‌లో ప్రధాన రహదారి పక్కన 11 కేవీ విద్యుత్ లైన్ (కండక్టర్) శనివారం మధ్యాహ్నం తెగిపడింది. ముదిగల్లు రోడ్డు, అనంతపురం ప్రధాన రహదారి లింక్ రోడ్డులో విద్యుత్ లైన్ తెగిపడిన సమయంలో అక్కడ ఎవరూ లేరు. దీంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులు విషయాన్ని తెలుసుకొని వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం ఏడీ గురురాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతు పనులు చేశారు.

చెత్త తీసుకెళ్లలేదని నిరసన



చెత్తను మున్సిపల్ కార్యాలయం ముందు పడేస్తున్న పారాళ్ల హర్ష

రాయదుర్గంటౌన్: చెత్త సేకరణ విషయంలో అధికారుల అలసత్వంపై విసుగు చెందిన పారాళ్ల హర్ష అనే వ్యక్తి శనివారం ఉదయం తన దుకాణం వద్ద చెత్తను మున్సిపల్ కార్యాలయం ముందు పడేసి నిరసన తెలియజేశాడు. మొలకాల్మూరు రోడ్డులో ఓ కమర్షియల్ కాంప్లెక్స్‌లో హర్ష దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణం వద్ద నుంచి చెత్త తీసుకెళ్లలేదని అధికారులకు తెలియజేశాడు. అయినా పట్టించుకోలేదని కార్యాలయం ఎదుట చెత్త పడేసివెళ్లాడు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్ మాట్లాడుతూ చెత్త విషయం తమ దృష్టికి వచ్చిందని, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నేమకల్లు అంజన్నకు పూజలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజనేయస్వామికి శనివారం అమావాస్య సందర్భంగా పూజలు జరిగాయి. బళ్లారి రూరల్ మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి ఆలయంలో హోమం జరిపించారు. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు.

31 నుంచి మురడిలో బ్రహ్మ రథోత్సవం

రాయదుర్గం: మురడి ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 2 వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. 31న రాత్రి 7 గంటలకు ముత్యాల పల్లకి, ఏప్రిల్ 1న సాయంత్రం 5 గంటలకు బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తున్నట్టు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. 2న లంకా దహనం, 6న సీతా రాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వడ్రవన్నూరులో సంబరాలు



కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, చిత్రంలో మెట్టు విశ్వ

రాయదుర్గం: వడ్రవన్నూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. ఎంపీటీసీ కురుబ అరుణ్‌కుమార్‌ను ఎంపీటీసీ సభ్యులంతా వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ స్వగృహం వద్ద పార్టీ శ్రేణులు, భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమానికి యువతనేత మెట్టు విశ్వనాథ్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం మెట్టు విశ్వ మాట్లాడారు. వచ్చే ఎన్నికలకు మరింత బాధ్యతగా పనిచేయాల్సి ఉందన్నారు. మండల కన్వీనర్ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండుగ పూటా తప్పని పడిగాపులు



- ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజల అవస్థలు
- ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ ఈకేవైసీ కోసం తప్పని తిప్పలు
- సచివాలయాల్లో ఈకేవైసీ చేయని సిబ్బంది



కర్ణాటక బ్యాంక్ వద్ద ఆధార్ కార్డుల అప్‌డేట్ కోసం చిన్నారులతో పడిగాపులు కాస్తున్న తల్లిదండ్రులు

కళ్యాణదుర్గం: నియోజకవర్గ ప్రజలకు ఉగాది పండుగ పూట కూడా పడిగాపులు తప్పడం లేదు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజా పాలన సాగిస్తామని గొప్పలు చెప్పిన కూటమి నేతలు..ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడంలోనూ విఫలమయ్యారు. దీంతో ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు చంటిపిల్లలతో కలిసి మండుటెండలోనూ వచ్చి ఇబ్బందులు పడుతున్నారు.

గంటల తరబడి పడిగాపులు..

ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజల అవస్థలు పడుతున్నారు. కళ్యాణదుర్గంలో యూనియన్ బ్యాంక్, కర్ణాటక బ్యాంక్, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయాల్లో మాత్రమే ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఉన్నాయి. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చిన్నారులతో కలిసి తల్లిదండ్రులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు గొప్పలు చెప్పున్న కూటమి ప్రభుత్వం.. ఆ దిశగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడంలో విఫలమైంది. ఆధార్ కేంద్రాల ఏర్పాటు చేయాలని, ఆయా గ్రామాల సచివాలయాల్లోనే ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసేలా అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య వచ్చింది ఇలా..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో రేషన్ కార్డు దారులు ఈకేవైసీ నమోదు చేయించుకోని వారు తప్పక చేయించుకోవాలని సూచించింది. దీంతో ఈకేవైసీ నమోదు కాని వారు రేషన్ దుకాణాలకు వెళ్లగానే వేలిముద్రలు తీసుకోకపోవడంతో ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని డీలర్లు సూచిస్తున్నారు. దీంతో చిన్నారులతో తల్లిదండ్రులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నారు.

సచివాలయాల్లో ఈకేవైసీ చేయని సిబ్బంది..



బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

రేషన్ కార్డుల్లో ఈకేవైసీ నమోదు కాని వారి వివరాలు రేషన్ డీలర్లు, వీఆర్వో, సివిల్ సప్లయి అధికారులు, డిప్యూటీ తహసీల్దార్ వద్ద జాబితాలు ఉంచారు. ఈకేవైసీ సైతం ఆయా వీఆర్వోలు, రేషన్ దుకాణాలు, గ్రామ/వార్డు సచివాలయాల్లో వీఎస్‌డబ్ల్యూఎస్ మొబైల్ యాప్ ద్వారా వేలిముద్రలు వేయించుకుని ఈకేవైసీ వేయించాల్సి ఉంది. అయితే కేవలం రేషన్ దుకాణాల్లో మాత్రమే ఈకేవైసీ చేస్తున్నారు. సచివాలయాల్లో ఈకేవైసీ చేయాలని నిబంధనలున్నా ఎక్కడా అమలు కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశాం

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఆరు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో రెండు, గోళ్ల, నారాయణపురం, కుందుర్పి, బ్రహ్మసముద్రం కేంద్రాల్లో ఒక్కో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ఆధార్ అప్‌డేట్ కొరకు ఆయా మండలాల ప్రజలు మండల పరిధిలో ఏర్పాటు చేసిన సచివాలయాలలో సేవలు వినియోగించుకోవచ్చు. ఎక్కడైనా సచివాలయాలలో ఆధార్ అప్‌డేట్ సేవలు అందకపోతే వెంటనే నా దృష్టికి తీసుకురండి.

– నాగేశ్వరరావు, డీఎల్‌డీఓ, కళ్యాణదుర్గం

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

- జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు



కూడేరు: మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు

కూడేరు: చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఆయన కరుట్లపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో పర్యటించారు. రోజూ చెత్తను క్లాప్ మిత్రలు ఇంటింటా సేకరిస్తున్నారా? అని ప్రజలతో ఆరా తీశారు. ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. చెత్త వీధుల్లో పడేయొద్దని ప్రజలకు సూచించారు. డస్ట్‌బిన్లలో చెత్త వేస్తే క్లాప్ మిత్రలు వచ్చి తీసుకెళ్తారని డీపీఓ తెలియజేశారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ప్రతి క్లాప్ మిత్ర కేటాయించిన 250 ఇళ్ల నుంచి చెత్తను తప్పనిసరిగా సేకరించాలని ఆదేశించారు. అనంతరం చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తడి పొడి చెత్త వేరుచేసి వర్మీ కంపోస్టును ఎలా తయారు చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శి హరితో ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబుళమ్మ, పంచాయతీ కార్యదర్శి హరి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రమా.. టీడీపీ కార్యాలయమా!



చిన్నంపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రం వద్ద టీడీపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

శెట్టూరు: మండలంలోని చిన్నంపల్లిలో ఆరోగ్య ఉపకేంద్రం వద్ద టీడీపీ నాయకులు పార్టీ జెండా ఎగరవేశారు. శనివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య ఉపకేంద్రానికి పక్కనే జెండా కట్ట ఏర్పాటు చేసి, పార్టీ జెండాను ఎగురవేశారు. దీనిపై గ్రామంలో ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. జాతీ య జెండా ఎగరవేయాల్సిన చోట ఒక పార్టీ జెండా ఎగురవేయడం ఏమిటని చర్చించుకున్నారు.

కెంచంపల్లిలో తాగునీటి ఎద్దడి తీవ్రం



'శ్రీరామరెడ్డి' తాగునీటి పథకం కొళాయి వద్ద నీటి కోసం పోటీ పడుతున్న మహిళలు

కుందుర్పి: మండలంలోని కెంచంపల్లి, నాగేపల్లి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఉగాది పండుగ పూట కూడా తాగునీరు లేకపోవడంతో ప్రజలు వ్యవసాయ పొలాలు, బోరుబావుల వద్దకు, పొరుగు గ్రామాలకు వెళ్లి బండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాల్తో తెచ్చుకుంటున్నారు. కెంచంపల్లిలో ఉన్న మంచినీటి బోరుబావిలో భూగర్భజలాలు అడుగంటడంతో సమస్య తలెత్తిందని, దీనికి తోడు గ్రామంలో అక్రమంగా కొళాయి కనెక్షన్లు తీసుకున్నారని సర్పంచ్ గంగాధర తెలిపారు. మండల స్థాయి అధికారులు స్పందించి గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తాం



ఎస్సీ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏసీ ఎర్రిస్వామి



చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందా చంద్రమ్మ



మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి బోయ సుశీలమ్మ

ఉరవకొండ: పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలోనూ మరింత కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీలో చోటు దక్కించుకున్న ఏసీ ఎర్రిస్వామి, చందా చంద్రమ్మ, బోయ సుశీలమ్మ తెలిపారు. ఉరవకొండకు చెందిన ముగ్గురికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో చోటు దక్కింది.

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఉరవకొండకు చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామికి ఎస్సీ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అవకాశం కల్పించారు. మాజీ ఎంపీపీ, చేనేత కులానికి చెందిన చందా చంద్రమ్మకు చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, సీనియర్ నాయకురాలు, మాజీ మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ బోయ సుశీలమ్మకు పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈసందర్భంగా రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకున్న ఏసీ ఎర్రిస్వామి, చందా చంద్రమ్మ, బోయ సుశీలమ్మ మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సంక్షిప్త సమాచారం

మూడోసారీ వేలం వాయిదా

రాయదుర్గంటౌన్: జంతువధ శాలలో సుంకం వసూలుకు శనివారం మూడోసారి నిర్వహించిన బహిరంగ వేలం మరోసారి వాయిదా పడింది. ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు వరుసగా వేలం నిర్వహించినా ఎవరూ ఆసక్తి కనబరచలేదు. పాటదారులంతా మొదటి రోజు నుంచే సిండికేట్ అయ్యి, తక్కువ ధరకు జంతువధ శాలను దక్కించుకునేందుకు యత్నించారు.

జాగ్రత్తలు పాటించాలి

కూడేరు: వినియోగదారులు జాగ్రతలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలను అరికట్టవచ్చని ట్రాన్స్‌కో ఏఈ గౌస్ తెలిపారు. శనివారం కూడేరు విద్యుత్ ఉప కేంద్రంలో గృహాలు, వ్యవసాయ పొలాల్లో విద్యుత్ ప్రమాదాలు ఏవిధంగా జరుగుతున్నాయో అవగాహన కల్పించారు. స్టార్టర్ పెట్టెలు, బోర్డుల నుంచి పొగలు వస్తే నేరుగా చేతి తో తాకితే షాక్‌కు గురి కావాల్సి వస్తుందని, షాక్‌కు గురైన వారి పక్కనే ఉన్నవారు తాకొద్దని ఏఈ తెలిపారు.

మోతాదుకు మించి వాడితే నష్టమే

కూడేరు: భూసార పరీక్ష ఆధారంగా సాగు చేసే పంటలకు రసాయనిక ఎరువులు వాడాలని, మోతాదుకు మించి వాడితే నష్టపోవాల్సి ఉంటుందని భూసార పరీక్ష కేంద్రం ఏఓ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. శనివారం కమ్మూరు రైతు సేవా కేంద్రంలో మట్టి పరీక్షల ద్వారా సమగ్ర ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మట్టి నమూనాలను ఏవిధంగా సేకరించాలి, ఎక్కడ సేకరించాలి, సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రతలపై వివరించారు. కార్యక్రమంలో ఏఓ విజయకుమార్, ఎంపీఈఓ రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

కోళ్లఫాం నిర్వాహకుడికి నోటీసు జారీ

బెళుగుప్ప: కళ్యాణదుర్గం రోడ్డు వైపున ఉన్న కోళ్లఫాం నిర్వాహకుడికి పంచాయతీ అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. కోళ్లఫారాలు గ్రామ సమీపంలోనే ఉన్నాయి. పాఠశాలలు, ఫాదర్ ఫెర్రర్‌కాలనీవాసులు దుర్వాసన భరించలేకపోతున్నామని పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ సెక్రటరీ భ్రమరాంబ సిబ్బందితో కలిసి కోళ్లఫారం నిర్వాహకుడు సురేష్‌కు శనివారం నోటీసు జారీ చేశారు.

చోళసముద్రం ఎంపీటీసీ మృతి



నాగభూషణం ఫైల్

కూడేరు: జయపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, చోళ సముద్రం ఎంపీటీసీ సభ్యుడు కురుబ నాగభూషణం (60) శనివారం రాత్రి మృతి చెందాడు. కొద్ది రోజు లుగా నాగభూషణం అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మున్సిపల్ ఏఈ నరసింహులు, ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి పట్టణానికి నీటి సరఫరా చేసే వీరాపురంలోని పంప్‌హౌస్‌తో రహదారి వెంబడి లీకేజీలను పరిశీలించారు. రాతిబావంక వద్ద గల పైప్‌లైన్ లీకేజీని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఏఈని ఆదేశించారు. వీరాపురం పంప్‌హౌస్‌లో స్టాండ్‌బై మోటార్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

ఊరూరా విశ్వావసు నామ సందడి



మామిడి కొమ్మలు కొంటున్న ప్రజలు

రాయదుర్గంటౌన్: తెలుగింటి లోగిళ్లలో కొత్తకాంతులు వెదజల్లేందుకు విశ్వావసు నామ సంవత్సర ఉగాది వచ్చింది. ఆదివారం ఉగాది పండుగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. వివిధ రకాల పండ్లు, సామగ్రి, దుస్తులు కొనుగోలు చేశారు. దీంతో ప్రజలతో పట్టణ వీధులు కిటకిటలాడాయి. మరోవైపు రంజాన్ పర్వదినం కూడా సోమవారం జరగనుండడంతో పట్టణంలోని కిరాణా షాపులు, దుస్తుల షాపులు, రెడిమేడ్ గార్మెంట్స్, కూరగాయల మార్కెట్‌లలో ప్రజలు కిక్కిరిశారు. మెయిన్ బజార్, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు, కూరగాయాల షాపింగ్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో జనంతో రద్దీగా మారాయి.

కిటకిటలాడిన కిరాణా షాపులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కిరాణా షాపులు ప్రజలతో కిటకిటలాడాయి. ఉగాది పండుగ సందర్భంగా నిత్యావసర సరుకులు కొనుగోలు కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి రావడంతో దుకాణాలు కిక్కిరిశాయి. ప్రజలు ఉగాది పండుగను ఘనంగా జరుపుకుంటారు. శనివారం నిత్యావసర సరుకుల కొనుగోలుకోసం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చారు.



ఉరవకొండ: ఉగాది పండుగ కొనుగోళ్లతో కిక్కిరిసిన క్లాక్‌టవర్ ప్రాంతం

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉగాది పండగ సందడి మొదలైంది. శనివారం మండల కేంద్రం వజ్రకరూరులోని మెయిన్ బజార్‌లో ఉగాది పండుగకు సరుకులు, దుస్తులు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో సందడి నెలకొంది.

ఉరవకొండ: పట్టణంలోని క్లాక్‌టవర్ ప్రాంతం పండుగ సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడింది. అరటి ఆకులు, పూలు, టెంకాయలతో పాటు ఉగాది పచ్చడికి కావాల్సిన సామగ్రి ప్రజలు కొనుగోలు చేశారు. పండుగ సందర్భంగా పూల ధరలు, నిత్యావసర ధరలు, కూరగాయల ధరలు పెరిగాయి.

ప్రతి ఇంట్లో సంతోషాలు వెల్లివిరియాలి



వై.విశ్వేశ్వరరెడ్డి మాజీ ఎమ్మెల్యే

ఉరవకొండ: ప్రతి ఇంట్లో సంతోషాలు వెల్లివిరియాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే ఉగాది పండగకు విశ్వేశ్వరరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు సంవత్సరాదిలో రైతులు, అన్ని వర్గాల ప్రజలకూ అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించి, వారికి సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

ఉగాది పండుగ సంతోషంగా జరుపుకోవాలి



డాక్టర్ తలారి రంగయ్య, పార్టీ సమన్వయకర్త, కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం: ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం ప్రజలకు విశ్వావసు నామ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరికీ కొత్త సంవత్సరంలో అన్ని శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సిరి సంపదలతో ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ఉగాది పచ్చడి మాదిరిగానే ప్రజలు మంచి, చెడు, కష్ట, సుఖాలను అధిగమిస్తూ ఉన్నత స్థానంలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

తెలుగు సంవత్సరాది కలిసి రావాలి



వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

ఉరవకొండ: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ ప్రజలు, రైతులకు కలిసిరావాలని ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆకాంక్షించారు. శనివారం ఆయన ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలు ఎక్కడున్నా వారు సంతోషంగా ఉగాది జరుపుకుంటారన్నారు. నూతన తెలుగు సంవత్సరాదిలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో రైతులు తులతూగాలని కోరుకున్నారు.

చట్టం ముందు అందరూ సమానమే



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ బాలకిషన్

కంబదూరు: భారత రాజ్యాంగం రూపొందించిన చట్టం ముందు కుల,మాతలకు అతీతంగా అందరూ సమానమేనని తహసీల్దార్ బాలకిషన్ అన్నారు. శనివారం మండలంలోని చెర్లోపల్లిలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు చట్టాలపై అధికారులు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజలందరూ ఐక్యతగా ఉండాలని, స్వేచ్ఛగా జీవించాలని సూచించారు. ఏమైనా సమస్యలొస్తే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వార్డెన్ నాగరాజు, వీఆర్వోలు సంజీవ్‌రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్ బోధనలు మానవాళికి ఆదర్శం



పురాతన టిప్పుసుల్తాన్ జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: దివ్యఖురాన్ బోధనలు మానవాళికి ఆదర్శమని ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, మసీదు ఇమామ్‌లు నూర్ మహమ్మద్, ఏజాజ్ ముస్తఫా తదితరులు పేర్కొన్నారు. రంజాన్ మాసంలోని చివరి 29వ షబ్ ఏ ఖద్ర్ (ఖురాన్ అవతరించిన రాత్రి) వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని మసీదుల్లో శనివారం రాత్రి నుంచి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలతో మసీదు ఇమామ్‌లు సామూహిక దువా పఠించారు. ఆదివారం నెలవంక దర్శనం అయితే సోమవారం ఈదుల్ ఫితర్ రంజాన్ పండుగ జరుపుకుంటారని తెలిపారు.

వీహెచ్‌పీఎస్ నాయకుడికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న

కూడేరు: ముద్దలాపురానికి చెందిన దివ్యాంగుడు, వీహెచ్‌పీఎస్ అధికార ప్రతినిధి పెద్దన్న తమిళనాడు ఆసియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. పెద్దన్న దివ్యాంగుల సంఘం నాయకుడిగా అంచలంచలుగా ఎదిగారు. దివ్యాంగుల సమస్యలపై పోరాటాలు ఎన్నో చేశారు. దివ్యాంగులకు అండగా నిలిచి అందిస్తున్న సేవలను గుర్తించి తమిళనాడు ఆసియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ డాక్టరేట్ అందించేందుకు ముందుకు వచ్చింది. ఇతర రాష్ట్రం తన సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేయడం తనకెంతో ఆనందంగా ఉందని పెద్దన్న తెలిపారు.